## క్లుప్తంగా

### బోరంచ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


పూజలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

**మనూరు(నారాయణఖేడ్):** జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు గుండేరావు, పూజారులు శ్రీకాంత్‌స్వామి, నాగయ్యస్వామి, సిద్దుస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**హత్నూర( సంగారెడ్డి):** మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన లాలీ నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బీఆర్ఎస్ నుంచి రూ. 2 లక్షల చెక్కును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కుటుంబానికి ఆదివారం అందజేశారు. పార్టీ కార్యకర్తగా సభ్యత్వం ద్వారా వచ్చే బీమా డబ్బులను అందించారని స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, రామచంద్రారెడ్డి, నవీన్ గౌడ్, అజీజ్, ఇబ్రహీం తదితర నాయకులున్నారు.

### గీతం అధ్యాపకుడికి డాక్టరేట్

**పటాన్‌చెరు:** గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను డాక్టరేట్ వరించింది. 'కావిటేటింగ్ ఫ్లో పాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీస్ యొక్క ప్రయోగాత్మక, సంఖ్యాపరమైన పరిశోధన' చేసి దానిపై సిద్ధాంత వ్యాసాన్ని.. జగదీశ్వర్ సమర్పించారు. దీంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అందుకున్నారు. ఓయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఉష్రీ, సీబీఐటీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి మార్గదర్శనంలో పరిశోధనను చేపట్టినట్టు ఆయన.. ఆదివారం వెల్లడించారు. గీతం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డీఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్.శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.

### మాతా మనికేశ్వరి ఆశ్రమ వార్షికోత్సవం

13, 14వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు

**హత్నూర(సంగారెడ్డి):** మండలంలోని సిర్పూర్ గ్రామ శివారులోని సద్గురు రూపరహిత అహింసా యోగేశ్వరి వీర ధర్మజ మాతా మాణిక్యేశ్వరి ఓంకార్ ఆశ్రమం 27వ వార్షికోత్సవం ఈనెల 13, 14వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి దేవదాసు స్వామి తెలిపారు. 13న ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం శివపార్వతుల పల్లకీ ఊరేగింపు, రాత్రి అఖండ భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సూర్యనంది క్షేత్రం యానగుంది పీఠాధిపతి శివయ్య స్వామీజీ చేతుల మీదుగా గోశాల ప్రారంభోత్సవం చేస్తారన్నారు. కార్యక్రమాలకు మాధవానంద సరస్వతీ స్వామీజీ రాజయోగి వెంకటస్వామి, అవధ గిరి మహారాజ్ బర్దిపూర్ స్వామీజీ , కృష్ణానంద స్వామీజీ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

### ఉత్సవాలు ప్రారంభం


ప్రార్థనలు చేస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు

**ఝరాసంగం(జహీరాబాద్):** మండల పరిధిలోని బర్దీపూర్‌లో హజరత్ షానురే ఇమామ్ దర్గా గంధం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఆదివారం మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వేణుగోపాల్‌రెడ్డి, ఆశన్న, నర్సింహులు, షేక్ అహ్మద్, రాజేందర్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక కుంకుమార్చన


నారాయణఖేడ్: పూజలో మహిళలు


సంగారెడ్డి టౌన్: పూజల్లో మహిళలు

**నారాయణఖేడ్:** వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖేడ్ షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహాప్రసాద వితరణ చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**సంగారెడ్డి టౌన్ :** పట్టణ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో హోమం జరిగింది. మహిళలు లలిత సహస్ర పారాయణం గావించారు. ఆపై సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

# 'శ్రమ'దానం


శ్రమదానం చేస్తున్న ఎంపీడీఓ, నాయకులు

**జిన్నారం(పటాన్‌చెరు):** పరిసరాలు ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిన్నారం ఎంపీడీఓ రాములు సూచించారు. ఆదివారం మండలకేంద్రంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రోడ్లను అధికారులు, నాయకులు శుభ్రం చేశారు. అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజలు వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

# సదుపాయాల కల్పనతోనే గ్రామాలాభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

**నారాయణఖేడ్:** మౌలిక సదుపాయాల కల్పనతోనే గ్రామాలు అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. మండలంలోని పోతన్‌పల్లి (ఎం), మాద్వార్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. హైమాస్ట్ లైట్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లను ప్రారంభించారు. పెద్దశంకరంపేట మండలం మూసాపేటకు చెందిన మహిళా రైతు బాలమణి ఈ మధ్య మృతిచెందగా రైతు బీమా కింద రూ.5 లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే తన స్వగృహంలో చెక్కును ఆమె కుమారుడు మల్లేశంకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ మల్లేశం, రమేష్ చౌహాన్, ఎంపీటీసీ నగేష్, నాయకులు కిష్టాగౌడ్, అంజిరెడ్డి, మారుతి, దస్తాగౌడ్, పెంటయ్య, శ్రీనివాస్, సాయిరెడ్డి, కృష్ణ, భూమేష్, రాధాకిషన్, రవి, శ్రీకాంత్, ప్రవీణ్‌గౌడ్, శ్రీను నాయక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లకుంట కబ్జా

- పట్టించుకోని అధికారులు
- కుంటను కాపాడాలంటున్న కొడకంచి మత్స్యకారులు, రైతులు

> శిఖం భూమిని కబ్జా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేస్తే అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు, మత్స్యకారులు విమర్శిస్తున్నారు. ఆక్రమణకు గురైన భూమి విలువ కోట్లలో ఉంటుందని చెబుతున్నారు. కుంటపై ఆధారపడి పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారు.


గొల్లకుంటను పూడుస్తూ వేసిన మట్టి

**జిన్నారం(పటాన్‌చెరు):** జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామ శివారులో సర్వేనంబర్ 216లో 7.2 ఎకరాల విస్తీర్ణంలో గొల్లకుంట ఉంది. దీన్ని ఆనుకొని హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పట్టా భూమి కలదు. అతను తన భూమితోపాటు గొల్లకుంటను కూడా కబ్జా చేసి చదును చేయించాడు. కుంటను పూడ్చేందుకు 500 ట్రిప్పుల మట్టిని ఉపయోగించారు. దీనిపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు స్థానికంగా ఉన్న రైతులు, మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. పదిరోజుల క్రితం ఇరిగేషన్ ఏఈఈ దిలీప్ తన సిబ్బందితో కలిసి ఇక్కడికి వచ్చి స్వయంగా పరిశీలించారు. స్థలం కబ్జాకు గురైందని గుర్తించి పది ట్రిప్పుల మట్టిని తొలగించి చేతులు దులుపుకున్నారు. కబ్జా చేసిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ విషయమై స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవటం లేదని తెలుస్తోంది. 7.2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కుంట 2 ఎకరాల వరకు కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాని విలువ సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఈ కుంటపై ఆధారపడి సుమారు 50 మంది రైతులు.. 25 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. అధికారులు స్పందించి కుంటను రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు లేవు**

కుంటను కబ్జా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశాం. కొంతవరకే అధికారులు మట్టిని తొలగించారు. పూర్తి స్థాయిలో భూమిని పరిరక్షించాలి లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

నాగరాజు, రైతు, కొడకంచి

**కబ్జాను గుర్తించాం**

ఈ విషయమై మాకు ఫిర్యాదు అందగా కబ్జా గుర్తించాం. పూర్తి స్థాయి విచారణ చేపట్టి కుంటను కాపాడేలా చర్యలు తీసుకుంటాం. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

రామస్వామి. ఇరిగేషన్ డీఈ

# సామాజిక సేవతోనే సార్థకత


మన్నాపూర్‌లో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి

**జహీరాబాద్:** సామాజిక సేవల ద్వారానే జీవితానికి సార్థకత చేకూరుతుందని ప్రముఖ శాస్త్రవేత్త, పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌లో రూ.5లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా పార్లమెంట్ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలు తాగేందుకు ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు గుండ్‌రెడ్డి, ట్రస్ట్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, ఎస్.విఠల్‌రెడ్డి, డాక్టర్ సురేష్‌కుల్‌కర్ణి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలగించాలి



మాట్లాడుతున్న యాదగిరి

**సంగారెడ్డి:** ఉద్యోగాల పేరిట అక్రమాలకు పాల్పడుతున్న అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించకపోతే విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ, కొంతమంది కార్మికులను తొలగించి ఆస్థానాల్లో తన కుటుంబ సభ్యులను, మరికొందరిని నియమించుకొని లక్షల రూపాయలు తీసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు స్పందించక పోవడం చాలా దారుణమన్నారు. కార్మికుల హాజరు కోసం కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఇవ్వకుంటే పూర్తిగా తొలగిస్తానని బెదిరిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తారాసింగ్, పుండరీకం, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# షబ్బీర్ అలీని కలిసిన మైనార్టీ నేతలు


షబ్బీర్‌అలీని సత్కరిస్తున్న మైనార్టీ నేత

**జహీరాబాద్:** ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీని జహీరాబాద్‌కు చెందిన పలువురు మైనార్టీ నేతలు కలిశారు. ఆదివారం ఆయన చాంబర్‌లో మైనార్టీ కమిషన్ అడ్వయిజరీ కమిటీ రాష్ట్ర మాజీ సభ్యుడు సద్రుద్దీన్‌గౌరి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రభుత్వం తరపున ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు తన సేవలందిస్తానని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జుబేర్, ముజీబ్ పాల్గొన్నారు.

### ప్రవేశ పరీక్ష ప్రశాంతం

**హత్నూర( సంగారెడ్డి):** ఐదో తరగతి ప్రవేశాల కోసం ఆదివారం ఎంట్రెన్స్ టెస్ట్ జరిగింది. మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. 408 మంది విద్యార్థులకు గాను 375 మంది పరీక్ష రాశారని, 33 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

**జహీరాబాద్:** మండలంలోని రంజోల్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. 450 మంది హాజరయ్యారు. మొత్తం 480 మందికి గాను 30 మంది గైర్హాజరయ్యారు.

**మునిపల్లి(అందోల్):** బుదేరా మహిళ డిగ్రీ కళాశాలలో వీటీజీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ ఆరా ఆదివారం తెలిపారు. 336 మంది విద్యార్థులకు గాను 320 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

**కోహీర్(జహీరాబాద్):** మండలంలోని దిగ్వాల్ పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో 225 విద్యార్థులు హాజరయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలాదేవి తెలిపారు. 240 మందికి గాను 15 మంది గైర్హాజరయ్యారన్నారు.

**జిన్నారం(పటాన్‌చెరు):** స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షను నిర్వహించారు. 384 మందికి గాను 354 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

# షెడ్డులో అగ్ని ప్రమాదం


పటాన్‌చెరు టౌన్: ఎగిసిపడుతున్న మంటలు

**పటాన్‌చెరు టౌన్:** ఫుడ్ సెంటర్ షెడ్డులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన పటాన్‌చెరు శివారులోనే నవపాన్ సమీపంలో చోటుచేసుకుంది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జాన్యా నాయక్ కథనం ప్రకారం... నవపాన్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన అర్ధరాత్రి హై వే స్పైసి ఫుడ్ సెంటర్ (తడికెల షెడ్డు)లో అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం వచ్చింది. దీంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లోపలున్న రెండు సిలిండర్లను బయట తీసుకొచ్చామని జాన్యా తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు**

**హత్నూర( సంగారెడ్డి):** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన హత్నూర మండలం గుండ్ల మాచవరంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఒకే చోట ఉన్నాయి. అకస్మాత్తుగా మంటలు చేలరేగి దట్టమైన పొగ వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఇక్కడికి చేరుకొని సరఫరా నిలిపి వేసి మరమ్మతులు నిర్వహించారు.

**కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు**

**జిన్నారం(పటాన్‌చెరు):** కారు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జిన్నారం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్ల గ్రామానికి చెందిన సాయిరాం, జశ్వంత్ బైక్‌పై జిన్నారానికి వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ఘటనలో వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# క్రీడల్లో గెలుపు, ఓటములు సమానం

**చేగుంట(తూప్రాన్):** క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావించాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం చేగుంటలో సీసీఎల్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడిన వారు మరోసారి విజయం కోసం ప్రయత్నం ప్రారంభించాలని సూచించారు. క్రీడాకారులు ఐకమత్యంగా ఉండాలన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, రాజిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నియామకం**

**సంగారెడ్డి :** బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట జనరల్ సెక్రటరీ జి.ప్రేమేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**◆ క్యాలెండర్ ఆవిష్కరణ**



**జహీరాబాద్ టౌన్:** ముదిరాజ్ కుల సంఘం ప్రభుత్వ ఉద్యోగుల నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసంఘం జహీరాబాద్ అధ్యక్షుడు సంగప్ప ముదిరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుబడిన ముదిరాజ్‌లు బాగా చదువుకుని అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బరూర్ దత్తాత్రి, శ్రీశైలం, శ్రీనివాస్, మచ్చేందర్, సురేందర్, గోపాల్, రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**◆ కొనసాగుతున్న రాజశ్యామల యాగం**

**సంగారెడ్డి టౌన్:** పట్టణం పోతిరెడ్డిపల్లిలోని దత్తగిరి ఆశ్రమంలో రెండోరోజైన ఆదివారం కూడా రాజశ్యామల నవరాత్రుల మహాయాగం నిర్వహించారు. బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత మహారాజ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. తంగడపల్లి ఆశ్రమాధిపతి శివయోగి మహాస్వామి ముఖ్యఅతిథిగా పూజలు చేశారు.

**◆ విదేశీ పర్యటనలో ఎమ్మెల్యే దంపతులు**

**పటాన్‌చెరు:** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు యూకే పరిధిలోని సౌత్ వార్విక్షేర్‌లో గల అగ్రికల్చర్ అండ్ సైన్స్ కళాశాలను సందర్శించారు. నూతన పంటల సాగు విధానం, వంగడాలపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాత మేడం టుసాడ్స్, (ప్రముఖుల మైనపు విగ్రహాలు) నేషనల్ మ్యూజియంలను సందర్శించారు.

**◆ బైక్ చోరీ**

**నారాయణఖేడ్:** బైక్‌ను చోరీ చేసిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్అండ్‌బీ అతిథి గృహం వెనుక గల కాలనీలో నివసిస్తున్న సబ్బతి సంతోష్‌రెడ్డి శనివారం రాత్రి తన ఇంటి ఆవరణలో వాహనం నిలిపాడు. మరుసటి రోజు తెల్లవారుజామున బయటికి వచ్చి చూస్తే పార్క్ చేసిన వాహనం కనిపించడం లేదు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

**◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా విశ్వనాథ్**

**ఝరాసంగం(జహీరాబాద్):** భారతీయ జనతా పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా విశ్వనాథ్ యాదవ్ ఆదివారం నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా, రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

**జిన్నారంలో...**

**జిన్నారం(పటాన్‌చెరు):** బీజేపీ జిన్నారం మండల అధ్యక్షుడిగా సోలక్‌పల్లి గ్రామానికి చెందిన జగన్ రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షురాలు గోదావరి అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన గోదావరి, మండల, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని గ్రామాల్లో ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

**◆ గృహలక్ష్మి పథకంపై అవగాహన**



**నారాయణఖేడ్:** విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని పైడిపల్లిలో గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. రేషన్, ఆధార్ కార్డు, విద్యుత్ కనెక్షన్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌ను సిద్ధంగా ఉంచుకొని సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు తెలపాలన్నారు. బకాయిలు చెల్లించి ఉండాలని లైన్‌మన్ శోభన్‌బాబు గ్రామస్తులకు వివరించారు.

**◆ ఉపాధ్యాయుడికి ప్రతిభా పురస్కారం**



**రాయికోడ్(అందోల్):** మండలంలోని హస్నాబాద్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కే.నర్సింహులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2024 ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అలూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్- తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ వారు సంయుక్తంగా.. సంస్థ అధ్యక్షుడు అలూరి విల్సన్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ.. పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో శతచిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ఇందిర తదితరులున్నారు.

**◆ ఎంపీడీఓల బదిలీలు**

**సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు టౌన్:** ఎంపీడీఓలు ఆదివారం బదిలీ అయ్యారు. సంగారెడ్డి ఎంపీడీఓ రవీందర్ నిజామాబాద్‌కు, పటాన్‌చెరు ఎంపీడీఓ బన్సీలాల్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

**◆ ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం**

**జిన్నారం(పటాన్‌చెరు):** మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల మల్లికార్జునస్వామి ఉత్సవాలు రెండు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ నేత, కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**◆ ఎస్ఐగా కృష్ణయ్య బాధ్యతల స్వీకరణ**

**కోహీర్(జహీరాబాద్):** కోహీర్ ఎస్ఐగా పి.కృష్ణయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఝరాసంగం ఎస్ఐగా విధులు నిర్వర్తించిన కృష్ణయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు. కోహీర్ ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎస్ఐ జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు.

**◆ గుమ్మడిదల ఎస్ఐగా మహేశ్వర్‌రెడ్డి..**



**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల ఎస్ఐగా మహేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మారెడ్డి బదిలీపై సంగారెడ్డికి వెళ్లారు. నూతన ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన ఆయన్ను ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడేలా చర్యలు తీసుకుంటామని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.